క్లుప్తంగా

కంటి ఆపరేషన్ల కోసం 24 మంది తరలింపు



తాళ్లపూడి నుంచి ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వెళుతున్న బాధితులు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజన్ సెంటర్ నుంచి గురువారం ఉచిత కంటి ఆపరేషన్ల నిమిత్తం 24 మందిని నిడదవోలు తీసుకువెళ్లామని ఇన్‌చార్జి డాక్టర్ సీహెచ్ నాగరాజు తెలిపారు. ఈ సెంటర్ వద్ద ప్రతిరోజూ ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతోపాటు తాళ్లపూడి చుట్టు పక్కల గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారిని గుర్తించి సంస్థ వాహనంపై ఆపరేషన్ల కోసం నిడదవోలు తీసుకెళ్లినట్టు తెలిపారు. ప్రజలు విజన్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నాగరాజు కోరారు.

న్యాయవాది గుమస్తాల నూతన కార్యవర్గం ఎన్నిక



కొవ్వూరు న్యాయవాది గుమస్తాల నూతన కార్యవర్గ సభ్యులు

కొవ్వూరు(తాళ్లపూడి): కొవ్వూరు న్యాయవాది గుమస్తాల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా బాలదారి బాజ్జి, ఉపాధ్యక్షుడిగా డీఎల్ఎన్ సాయి, సెక్రటరీగా జేఏ రాజు, జాయింట్ సెక్రటరీగా పి.సత్తిబాబు, కోశాధికారిగా కె రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా బి పోలయ్య, సీహెచ్ రామారావు, కె శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

ఘనంగా సీతారామస్వామి ఊరేగింపు



ఉనకరమిల్లి ఊరేగింపులో గరుడ వాహనంపై ఉత్సవ విగ్రహాలు

నిడదవోలు రూరల్: ఉనకరమిల్లి గ్రామంలో సీతారామ కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని 83వ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామంలో స్వామి వారిని ఘనంగా ఊరేగించారు. ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన ఉత్సవ విగ్రహాలను గరుడవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మ్యూజికల్ బ్యాండ్ పార్టీ, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సందడిగా సోమాలమ్మ జాతర



సోమాలమ్మ జాతరలో గరగ నృత్యాలు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యిలోని బుచ్చయ్య నగర్‌లో కొలువైన సోమాలమ్మ జాతర గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని గరగ నృత్యాలు, శక్తి వేషధారణలు, కోయనృత్యాలు, వివిధ వేషధారణలతో వీధుల్లో ఊరేగించారు. అనంతరం నూతనంగా నిర్మించిన అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆకట్టుకున్న శక్తి వేషధారణ

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

నిడదవోలు : పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై విచారణ వేగవంతం చేయాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు, శాంతియుత ర్యాలీ కన్వీనర్ పైడి శ్రీలత కిషోర్ ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గంలోని వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై శాంతియుత ర్యాలీ నిర్వహించారు. సమిశ్రగూడెంలో ప్రారంభమైన ర్యాలీ చింతచెట్టు సెంటర్, అంబేడ్కర్ విగ్రహ సెంటర్, అరుంధతిపేట మీదుగా కొనసాగుతూ సమిశ్రగూడెం వంతెన వద్దకు చేరింది. అక్కడి నుంచి పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి సెంటర్, గణేష్ సెంటర్ మీదుగా స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్దకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీ కారణంగా పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా ఆల్‌ఇండియా దళిత్, క్రిస్టియన్ జాతీయ అధ్యక్షుడు లంక కరుణాకర్ దాస్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలున్నాయని వాటిని ప్రభుత్వం నివృత్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టును బహిర్గతం చేయాలన్నారు. శాంతియుత ర్యాలీ కన్వీనర్ పైడి శ్రీలత కిషోర్ మాట్లాడుతూ మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్రకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఒంగోలు ఎస్పీ కె. రాజా శిఖామణి, విశాఖ అడ్వకేట్ చింత ప్రకాష్‌బాబు, సహదేవ్, సత్యానందం, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు గ్రామంలో ఆర్‌డీడీఎస్ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, చెట్ల కొమ్మల తొలగింపు కోసం అంతరాయం కలుగుతుందన్నారు. 11కేవీ దుద్దుకూరు ఫీడర్‌పై ఉన్న సర్వీసులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ నిర్వహణ పనుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

- మండలంలోని యర్నగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ యర్నగూడెం ఇండస్ట్రియల్ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

గోపాలపురం: సబ్ స్టేషన్ వద్ద చెట్ల నరికివేత, ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం ఇండస్ట్రియల్ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. ఇండస్ట్రియల్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఈఈ తెలిపారు.

నిడదవోలు రూరల్: తాడిమళ్ల, కోరుమామిడి సబ్ స్టేషన్ల పరిధిలోని కోరుమామిడి, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, తాడిమళ్ల గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

దేవరపల్లి: మండలంలో వేసవి నీటి ఎద్దడి నివారణకు మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి గ్రామాలకు రూ.22.50 లక్షలు విడుదల చేసినట్టు ఎంపీడీఓ కె. వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో మంచినీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను కోరారు. ప్రతి పంచాయతీలో అదనంగా సబ్ మెర్సిబుల్ మోటార్లు, అవసరమైన గ్రామాల్లో పంపుసెట్, మోటారు కొనుగోలు చేయాలన్నారు. దేవరపల్లి పంచాయతీకి కొత్త మోటారు, పంపు, ఇతర సామగ్రి ఏర్పాటుకు రూ.1.50 లక్షలు, ఇందిరమ్మ కాలనీలో కొత్త మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి ఏర్పాటుకు రూ.4 లక్షలు, యర్నగూడెం పంచాయతీకి కొత్త మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రికి రూ.1.50 లక్షలు, సంగాయగూడెం పంచాయతీకి మోటార్, పంపుసెట్, ఇతర సామగ్రికి రూ.1.50 లక్షలు, లక్ష్మీపురం పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి ఏర్పాటుకు రూ. 1.50 లక్షలు, రామన్నపాలెం పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రికి రూ.1.50 లక్షలు, కురుకూరు పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి ఏర్పాటుకు రూ.1.50 లక్షలు, ధుమంతునిగూడెం పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి ఏర్పాటుకు రూ.1.50 లక్షలు, బందపురం పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.1.50 లక్షలు, త్యాజంపూడి పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.1.50 లక్షలు, యాదవోలు పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.1.50 లక్షలు, పల్లంట్ల పంచాయతీకి మోటారు, పంపుసెట్, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.1.50 లక్షలు, సంగాయగూడెంలోని ఎస్సీ ఏరియాలో గల వాటర్ ట్యాంకు మరమ్మతులకు రూ.2 లక్షలు విడుదల చేసినట్టు ఆయన తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆమోదంతో నిధులు విడుదల చేసినట్టు ఆయన తెలిపారు.

సేంద్రియ ఎరువులపై రైతుల ఆసక్తి



పొలాలకు పశువుల పెంటను తరలిస్తున్న రైతులు



చేలల్లో పెంట పోగులు

నల్లజర్ల: సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తిస్తున్న పలువురు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. తరచూ రసాయన ఎరువులు వినియోగించడం వలన భూసారం తగ్గడమే కాకుండా, పంటలకు చీడపీడలు సోకి దిగుబడులు తగ్గుతున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులను వినియోగించాలన్న వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు పశువుల పేడ, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని పొలాల్లో వేసుకుంటున్నారు. మరికొందరు ఇతర రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. పశువుల పేడ, పూడిక మట్టి వేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండటం వలన పంటలు ఎండిపోకుండా సేంద్రియ ఎరువులు తోడ్పడుతున్నాయని అంటున్నారు. చెరువు మట్టి, పశువుల పెంటలో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ వంటి పోషక విలువలు లభించడంతో పైర్లు అధిక దిగుబడి ఇస్తాయని రైతులు చెబుతున్నారు.

సంప్రదాయ పద్ధతులపై మొగ్గు



మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వలన భూసారం తగ్గిపోతుంది. ఇలాంటి చర్యలు భవిష్యత్తు తరాలకు ప్రతికూలంగా మారనున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతుల ఆలోచనా విధానం మారుతోంది. సంప్రదాయ పద్ధతుల్లోనే భూసారం పెంచేందుకు వారు ఆసక్తి చూపుతున్నారు. మేకలు, గొర్రెల వ్యర్థాలు, చెరువు పూడిక మట్టి, కుళ్లిన గెత్తం వేసుకోవడం, పచ్చిరొట్ట సాగు వంటి పద్ధతులు పాటిస్తున్నారు.

– కె.కమల్‌రాజ్, మండల వ్యవసాయాధికారి, నల్లజర్ల

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో రుణాలపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు(తాళ్లపూడి): లబ్ధిదారులకు ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం గురువారం వివిధ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి నియోజకవర్గంలోని బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కార్పొరేషన్ రుణాలపై రివ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుణాలను సకాలంలో మంజూరు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, ఇన్‌చార్జి ఎంపీడీవో టీబీ వెంకటరమణ, వివిధ బ్యాంకుల అధికారులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ప్రారంభోత్సవాలు

కుమారదేవంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఎన్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అనంతరం జిమ్-పార్క్, నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అవంతి ఫీడ్స్ అధినేత ఇంద్రకుమార్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు పాల్గొన్నారు. ఐ. పంగిడి, దేచర్ల గ్రామాల్లో రూ. 40 లక్షలు ఎన్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పీకే రంగారావు పాల్గొన్నారు.

అపరాల సాగుకు విత్తనాలు సిద్ధం

ఏఓ రాజారావు

గోపాలపురం: వేసవిలో అపరాల సాగుకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఏఓ బి.రాజారావు అన్నారు. గోపాలపురం మండలం చిట్యాల రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం 50 శాతం రాయితీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు నేలను ఖాళీగా ఉంచకుండా 365 రోజులు పచ్చదనంతో ఉండేలా చూడాలన్నారు. అపరాల సాగు కారణంగా వరి తదితర పంటలు చేసే సమయానికి భూసారం పెరుగుతుందన్నారు. గోపాలపురం మండలానికి 7.8 క్వింటాళ్ల మినుములు, 40 క్వింటాళ్ల పెసలు, ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవశాయ, ఉద్యానశాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.



చిట్యాల రైతు భరోసా కేంద్రం వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ రాజారావు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నిడదవోలు రూరల్: ప్రతి రోజూ పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడీ సెక్టర్ సూపర్‌వైజర్ పి.నళిని అన్నారు. మండలంలోని తాడిమళ్ల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పౌష్టికాహారం, 100 రోజుల ప్రాముఖ్యత, ఊబకాయంతో కలిగే అనర్థాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

నాసా ప్రాజెక్టుల్లో సత్తా చాటిన విద్యార్థులు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొవ్వూరు (తాళ్లపూడి): దేశ వ్యాప్తంగా నాసా నిర్వహించిన పోటీలో 30 మంది విద్యార్థులు శ్రీ చైతన్య విద్యా సంస్థల నుంచి ఎంపికయ్యారని రాజమండ్రి జోన్ ఇన్‌చార్జి వి.ఉదయ్‌శంకర్ తెలిపారు. కొవ్వూరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వద్ద విద్యార్థుల అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసారు. అనంతరం కొవ్వూరులో ర్యాలీ నిర్వహించారు. జాతీయస్థాయిలో అంతరిక్ష రంగంపై అవగాహన కల్పించేందుకు నాసా దేశ వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో 60 ప్రాజెక్టులను ఎంపిక చేయగా అందులో 30 ప్రాజెక్టులు శ్రీచైతన్య విద్యా సంస్థలు కైవసం చేసుకున్నట్టు ఉదయ్‌శంకర్ తెలిపారు. కొవ్వూరు నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైందని తెలిపారు. అకడమిక్ కోర్డినేటర్ పి కిరణ్ పాండే, ప్రిన్సిపాల్ ఎన్ఎస్ వీడీ మధుబాబు, డీన్ ఎస్ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పులూరి సేవలు అభినందనీయం



ఉప్పులూరి సత్యనారాయణకు మొక్క అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న వేణు, జక్కంపూడి రాజా, గణేష్

- జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి వేణు, జక్కంపూడి రాజా
- పలు సేవా కార్యక్రమాల నిర్వహణ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ సేవలు అభినందనీయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజానగరం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా కొనియాడారు. ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ జన్మదిన వేడుకలను గురువారం వెంకట నగరం, తొర్రేడు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు తొర్రేడు, వెంకటనగరం, రాజమహేంద్రవరంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు జరిపారు. ఆలయాల్లో పూజల అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. వెంకట నగరం సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించారు. తొర్రేడులోని బాలాజీ టౌన్ షిప్‌లో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ కేక్ కట్ చేశారు. ఆయనకు వేణు, జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ప్రయాణికులకు మజ్జిగ, చెరకు రసం పంపిణీ చేశారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, జియోన్ పాఠశాలలో పిల్లలకు అన్నదానంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వెంకట నగరం శివాలయం వద్ద నిర్మించిన కమ్యూనిటీ హాలును జక్కంపూడి గణేష్‌తో కలిసి ఉప్పులూరి ప్రారంభించారు. తొర్రేడు హరిజన పేటలో వైద్య శిబిరం, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పులూరి భిమానులు, తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కూటమి తీరుపై భవన నిర్మాణ కార్మికుల నిరసన



డిమాండ్లు నెరవేర్చాలని నిరసన తెలుపుతున్న కార్మికులు

- డిమాండ్లు నెరవేర్చకపోతే మే 5 నుంచి ఉద్యమం
- ఎన్నికల హామీలను నెరవేర్చాలంటూ నినాదాలు

సీటీఆర్ఐ: తమ ఇబ్బందులు, ఆవేదన, సమస్యలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా భవన నిర్మాణ కార్మికులు గురువారం నిరసన తెలిపారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 2024 మేనిఫెస్టోలో వంద రోజుల్లో కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పారన్నారు. వారు అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా, ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. తక్షణం స్పందించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని, లేకపోతే మే 5వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియచేస్తామన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, చెస్ విధానం ద్వారా వసూలు చేస్తున్న సొమ్మును కార్మికులకే వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రాజన్నబాబు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

జీవ కారుణ్య సంఘానికి రూ.50 వేల వితరణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన స్వర్గీయ అంగటి ప్రకాశరావు (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల) జ్ఞాపకార్థం ఆయన కుమారులు రమేష్, సురేష్, రాజేష్ గురువారం రూ.50 వేలను గురువారం గౌతమీ జీవకారుణ్య సంఘంలో నిత్యాన్నదాన పథకానికి వితరణ చేశారు. ఈ మేరకు జీవ కారుణ్య సంఘం అధికారి రాజుకు చెక్కు అందించారు. గతంలో వీరి అమ్మ అంగటి పార్వతి జ్ఞాపకార్థం రూ.50 వేలను అందజేశారు.

వైభవంగా కోదండ రాముని ఊరేగింపు



ఊనగట్ల రామాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



ఊనగట్లలో స్వామివారి ఊరేగింపు సందర్భంగా శక్తివేషాలు

చాగల్లు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామోత్సవాలు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఊనగట్లలో కోదండ రాముని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

బుట్ట బొమ్మలు, గొర్ర గేదెలు, శక్తివేషాలు, బాణసంచా కాలుస్తూ స్వామి వారిని వీధుల్లో ఊరేగించారు. రాత్రి పవళింపు సేవ, ఊయ్యాల సేవ నిర్వహించారు. చాగల్లులో అశోక్‌నగర్‌లో రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలు ముగింపులో భాగంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. బ్రాహ్మణగూడెంలో రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామచంద్రునికి పవళింపు సేవ

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా సీతంపేట రామాలయంలో గురువారం పవళింపు సేవ నిర్వహించారు. ముందుగా సీతా సమేత శ్రీరామచంద్రునికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా 21 మంది దంపతులకు సంప్రదాయ రీతిలో తాంబూలాలు అందించారు. అనంతరం సీతారామచంద్రులను పవళింపు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు స్వామివారి పవళింపు గదిని మల్లెపూలు, 28 రకాల పిండి వంటలతో అలంకరించారు.